

అభివృద్ధే అజెండా

సమన్వయంతో పనిచేసి జిల్లాను ప్రగతి పథంలో నడిపిద్దాం

- పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం
- అభివృద్ధి పనులు పూర్తి చేసే బాధ్యత అధికారులదే
- రోడ్లపై గుంతలను ఈ నెలాఖరులోగా పూడ్చాలి
- సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర. హాజరైన ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు

అనకాపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): "కలిసి పనిచేద్దాం. జిల్లాను పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో పరుగులు పెట్టిద్దాం. జిల్లాను అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందరూ కలిసి పనిచేసి అభివృద్ధిలో భాగస్వాములవుదాం" అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రణాళికల అమలుపై అధికారులు, ప్రజాప్రతినిధులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ అనకాపల్లి జిల్లాను ఐదేళ్లలో రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచేలా సమష్టిగా కృషి చేయాలన్నారు. తలసరి ఆదాయంలో విశాఖపట్నం జిల్లా మొదటి స్థానంలో వుండగా, పక్కనే వున్న అనకాపల్లి జిల్లా 12వ స్థానంలో ఉందని అన్నారు. జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని 2029 నాటికి విశాఖపట్నంతో సమానంగా అనకాపల్లిని అభివృద్ధిలో నిలిపేందుకు అధికారులు కలసికట్టుగా పనిచేయాలని అన్నారు. ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జిల్లాలో రోడ్ల మరమ్మతులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నిధులు మార్చి నెలాఖరులోగా ఖర్చు చేయాలని, అందువల్ల అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు ఏర్పాటు చేసేలా కృషి చేయాలని మంత్రి చెప్పారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించేందుకు ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ విజయ్‌కృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, జడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ్‌కుమార్, కేఎస్ఎన్ఎస్ రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జిల్లాను మొదటిస్థానంలో నిలుపుతాం

- అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధికి చర్యలు
- చోడవరం, మాడుగుల్లో పరిశ్రమల ఏర్పాటుపై అధ్యయనం
- జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర

·6లో

రూ.2 లక్షల కోట్లతో పారిశ్రామిక ప్రగతి

- జీడీపీలో విశాఖ సరసన అనకాపల్లి జిల్లాను చేర్చేందుకు కృషి
- జూన్‌నాటికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు
- రానున్న విద్యా సంవత్సరం నుంచి 'తల్లికి వందనం'
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర

అనకాపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, పారిశ్రామిక ప్రగతి కోసం రూ.2 లక్షల కోట్లతో ప్రణాళికలు రూపొందించామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రానున్న ఐదేళ్లలో అన్ని జిల్లాల్లో స్థూల జాతీయ ఉత్పత్తి(జీడీపీ)ని 15 శాతానికి పెంచేలా కార్యాచరణను అమలు చేస్తున్నామని చెప్పారు. జీడీపీలో విశాఖపట్నం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందని, రానున్న ఐదేళ్లలో అనకాపల్లి జిల్లాను కూడా విశాఖ స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలో పరిశ్రమలు, సేవా రంగాలు, వ్యవసాయ అభివృద్ధికి ఒక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. గత వైసీపీ ... మిగతా 6వ పేజీలో

ప్లాస్టిక్ కాలుష్యం

అనకాపల్లిలో విపరీతంగా పెరిగిన వాడకం



- ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనం
- తీవ్ర సమస్యగా మారడంతో స్పందించిన జీవీఎంసీ అధికారులు
- పలు రకాల ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువుల అమ్మకం, వినియోగంపై నిషేధం
- దుకాణాల్లో తనిఖీలు, ఈ నెలాఖరు వరకు అవగాహన
- వచ్చే నెల నుంచి జరిమానాలు

అనకాపల్లి టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):



పట్టణంలోని కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అనకాపల్లి జోన్ పరిధిలో ప్లాస్టిక్ కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్నది. తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల అమ్మకాలు, వినియోగం యథేచ్ఛగా సాగుతున్నాయి. దీంతో పట్టణంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. డ్రైనేజీలు నిండిపోయి మురుగునీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నాయి. ఈ సమస్యను గుర్తించిన జీవీఎంసీ అధికారులు.. ప్లాస్టిక్ నిషేధాన్ని సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించారు. జనవరి ఒకటో తేదీ నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చారు. ప్లాస్టిక్ విక్రయం/ వినియోగం జరిపే దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్లాస్టిక్ గ్లాస్‌లు, కవర్లను సీజ్ చేస్తున్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తున్నారు.

మహా విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తయారు చేయాలన్న సంకల్పంతో జీవీఎంసీ అధికారులు దృష్టి సారించారు. కమిషనర్ (మూడు రోజుల క్రితం బదిలీ అయ్యారు) ఇటీవల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్లాస్టిక్ అమ్మకాలు, వినియోగం జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 120 మైక్రాన్లకన్నా తక్కువ మందం వున్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, టీ కప్పుల వినియోగంపై నిషేధం విధించారు. ఇంకా ఆకుపచ్చ రంగు లామినేషన్‌తో వుండే పేపర్ ప్లేట్లు, తెలుపు కాకుండా ఇతర రంగుల్లో వుండే గుడ్డ సంచులను కూడా నిషేధించారు. అనకాపల్లి జోన్ పరిధిలో హోల్‌సేల్ ప్లాస్టిక్ అమ్మకాల దుకాణాలు 12 వరకు ఉన్నాయి. ఈ వ్యాపారులతో జోనల్ కమిషనర్ బీవీ రమణ ఇటీవల సమావేశం ఏర్పాటు చేసి 120 మైక్రాన్ లోపు మందంగల ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం విధించామని, ఎవరైనా అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనకాపల్లి పట్టణంలో అన్ని రకాల రిటైల్ దుకాణాలు 2,500 వరకు ఉన్నాయి. జీవీఎంసీ అధికారులు ఈ నెల ఒకటో తేదీ నుంచి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 600 దుకాణాల వరకు తనిఖీలు చేశారు. పది కిలోల వరకు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు సీజ్ చేశారు. ఈ నెలాఖరు వరకు దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తూ, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి నిషేధాన్ని పూర్తిస్థాయిలో అమలు ... మిగతా 6వ పేజీలో

గవరపాలెం గౌరమ్మకు ఘనంగా సారె ఊరేగింపు

అనకాపల్లి పట్టణంలోని సతకంపట్టులో కొలువుదీరిన గవరపాలెం గౌరీ పరమేశ్వరుల సారె మహోత్సవం బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. మహిళలు పసుపు, కుంకుమతోపాటు వివిధ రకాల పిండివంటలు, మిఠాయిలతో ఆలయానికి చేరుకుని.. చినరామస్వామికోవెల, దిబ్బవీధి, వేగివీధి, మెయిన్ రోడ్డు, పరమేశ్వరిపార్కు జంక్షన్ మీదుగా తిరిగి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



పురవీధుల్లో గౌరమ్మ సారెను ఊరేగిస్తున్న భక్తులు

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్ష



విశాఖలోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ (తొలి సెషన్) పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు నాలుగు వేల మందికిగాను సుమారు 3,600 మంది హాజరయ్యారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటలు, సాయంత్రం మూడు నుంచి ఆరు గంటల వరకు పరీక్షలు జరిగాయి. చినముషిడివాడ, షీలానగర్ పరీక్షా కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించలేదు. ఉదయం పరీక్షకు 8.30, మధ్యాహ్నం 2.30 గంటల తరువాత వచ్చిన అభ్యర్థులను పరీక్షల హాలులోకి అనుమతించబోమని సిటీ కో-ఆర్డినేటర్, విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరీబాయి పేర్కొన్నారు. నిబంధనలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులు ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.

ఏయూ వీసీ ఎంపిక ప్రక్రియ కొలిక్కి?

ముగ్గురు ఐఐటీ ప్రొఫెసర్ల పేర్లు సిఫారసు చేసిన సెర్చ్ కమిటీ

- ముంబై ఐఐటీ ప్రొఫెసర్‌కు చాన్స్?
- సీఎం దావోస్ పర్యటన అనంతరం ప్రకటనకు అవకాశం
- అనూహ్య పరిణామాలేవైనా చోటుచేసుకుంటే తప్ప దాదాపు ఆ ముగ్గురిలోనే ఒకరిని ఖరారు చేసే అవకాశం



విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి ఉప కులపతి నియామకం ప్రక్రియ దాదాపు ఒక కొలిక్కివచ్చినట్టు తెలిసింది. వీసీ ఎంపిక కోసం ఏర్పాటైన సెర్చ్ కమిటీ ఇప్పటికే రెండుసార్లు సమావేశమైంది. గడిచిన వారం సమావేశమైన కమిటీ...వీసీ పోస్టు కోసం మూడు పేర్లు ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఇందులో ఒకరిని వీసీగా నియమించే అవకాశం ఉంది. సెర్చ్ కమిటీ ఎంపిక చేసిన మూడు పేర్లు ఐఐటీల్లో సీనియర్ ప్రొఫెసర్లవిగా చెబుతున్నారు. ఈ ముగ్గురిలో ఒకరి పేరును రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసి గవర్నర్‌కు పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్‌లు ప్రస్తుతం దావోస్ పర్యటనలో ఉన్నారు. ఆ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే సీఎం వద్దకు ఈ ముగ్గురి పేర్లతో కూడిన ఫైల్ వెళుతుంది. వారిలో ఒకరిని ఎంపిక చేసి గవర్నర్‌కు పంపించే అవకాశం ఉందని చెబుతున్నారు. అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటే తప్ప ఆ ముగ్గురిలో ఒకరిని వీసీగా ఖరారు చేయడం దాదాపు ఖాయమని అంటున్నారు. ముగ్గురిలో ముంబై ఐఐటీలో పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెసర్ పేరును ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకున్నట్టు చెబుతున్నారు.

300 మందికిపైగా దరఖాస్తు

ఏయూ వీసీ పోస్టు కోసం సుమారు 300 మందికిపైగా ప్రొఫెసర్లు దరఖాస్తు చేసు కున్నారు. అందులో ఏయూలోని వివిధ విభాగాలకు చెందిన ప్రొఫెసర్లతోపాటు రిటైర్డ్ ప్రొఫెసర్లు, రాష్ట్రంలోని ఇతర వర్సిటీలకు చెందిన సీనియర్ ప్రొఫెసర్లు ఉన్నారు. వీరంతా తమ స్థాయిలో ప్రయత్నాలు సాగిం చారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన మాత్రం మరోలా ... మిగతా 6వ పేజీలో

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచేలా బోధన



సమావేశంలో డీసీవో ప్రభావతమ్మ, ప్రిన్సిపాల్ మాణిక్యం, తదితరులు

ఎలమంచిలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పదవతరగతి, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా బోధన సాగించాలని ఉమ్మడి జిల్లాల సమన్వయ అధికారి (డీసీవో) ప్రభావతమ్మ సూచించారు. మండలంలోని కొక్కిరాపల్లి డా.బీఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంపుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కోరారు.అనంతరం సైకాలజీ నిపుణులు సుజాత, తాళ్ల పాలెం, నక్కపల్లి గురుకులాల ప్రిన్సిపాల్స్ గ్రేస్, సువర్ణ తదితరులు విద్యార్థినులకు పలు సూచనలు అందించారు. ప్రిన్సిపాల్ మాణిక్యం పాల్గొన్నారు.

ఘనంగా అయోధ్య బాల రాముని ప్రథమ వార్షికోత్సవం



ఎంజేపురంలో రాముని ఊరేగిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రాముని ప్రథమ వార్షికోత్సవాన్ని ఎంజేపురం వాసులు బుధవారం రాత్రి ఘనంగా జరిపారు. అయోధ్యలో బాల రాముని ప్రతిష్ఠించి ఏడాది పూర్తవడంతో బాల గణపతి భజన బృందం సభ్యులు ఆధ్వర్యంలో రామాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. ఈకార్యక్రమంలో బంటు రాము, మట్టా సర్వలక్ష్మి, బంటు ఆనంద్, పీలా శ్రీను, కొమిరెడ్డి బాబ్జీ, ఎస్. కాశీనాయుడు, పెద్ద రాయుడు, కన్నకుమార్, రాంబాబు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులకు ఫలసాయం సమర్పణ



ఫలసాయం తీసుకువస్తున్న రైతులు

మునగపాక: స్థానిక గౌరీ పరమేశ్వరుల ఆలయానికి చెరువు కాలువ రైతు సంఘం పలు రకాల ఫలసాయం సమర్పించారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఉత్సవాలకు ముందు ఏటా ఒక మూలరైతు సంఘం పలు రకాలు ఫలసాయంను అందజేయడం ఆనవాయితీ. దానిలో భాగంగా బుధవారం రైతులంతా కొబ్బరి కాయలు, బెల్లం, పలు రకాల కూరగాయలు, చెరకు గెడలు, అరటి గెలలను ప్ర త్యేక వాహనం ద్వారా ఊరేగింపు ద్వారా వేపచెట్టు వద్ద ఉన్న ఆలయానికి తీ సుకువచ్చిఅందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, కోశాధికారి పొలిమేర కృష్ణతో పాటు కమిటీ సభ్యులు, సీతారాములు కమిటీ ఛైర్మన్ ఆడారి సూర్యచంద్రరామారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం ఫిబ్రవరి 1న జరగనున్నగౌరీపరమేశ్వరులు ఉత్సవంపై చర్చించారు.



సరుకులు తరలించాల్సిన వాహనంపై జనాలు ప్రయాణం



పోటీ పడి వెళ్తున్న సెజ్‌కు సంబంధించిన బస్సులు

ప్రమాదకర ప్రయాణం

- గూడ్స్ వెహికల్స్‌లో జనాల తరలింపు
- అచ్యుతాపురం సెజ్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణ
- పట్టించుకోని పోలీసు యంత్రాంగం

అచ్యుతాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తరచూ ఎక్కడోచోట ప్రమాదాలు చోటుచేసుకుని కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మరికొందరు దివ్యాంగులుగా మిగిలి జీవితాంతం క్షోభ అనుభవిస్తున్నారు. ఇలా ప్రమాదాలు చోటు చేసుకోవడానికి మానవ తప్పిదాలుంటున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యానికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. పారిశ్రామికంగా అభివృద్ధి ,చెందుతున్న అచ్యుతాపురంలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఇక్కడి సెజ్‌లో సుమారు 300కు మించి కర్మాగారాలున్నాయి. వీటిలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులను తీసుకువెళ్లటానికి రోజూ వందల సంఖ్యలో బస్సులు, ఇతర వాహనాలు అచ్యుతాపురం జంక్షన్ మీదుగానే రాకపోకలు కొనసాగిస్తున్నాయి. కర్మాగారాల్లో వివిధ పనుల్లో పనిచేస్తున్న కూలీలను కాంట్రాక్టర్లు వ్యాన్‌లపై తరలిస్తున్నారు. ఉదయం వీరిని కర్మాగారాలు తరలించి సాయంత్రం తిరిగి గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. నిత్యం ఇలా నిబంధనలు అతి క్రమించి ప్రయాణాలు సాగుతున్నాయి. కానీ పోలీసులు పట్టించుకోవడంలేదు. వ్యాన్‌ల యజమానులు నెలవారి చెల్లించడంతో పోలీసులు మిన్నకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ద్విచక్రవాహనాలపై ముగ్గురు నుంచి నలుగురు వెళ్తున్నారు. కర్మాగారాలకు ఉద్యోగులను తరలిస్తున్న బస్సుల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. బస్సు డ్రైవర్లు ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వాహనాలు ఓవర్ టేక్ చేయటం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సెజ్‌లో గల ఒక దుస్తుల కర్మాగారంలో అధికంగా మహిళలే ప్రయాణిస్తుంటారు. ఈ బస్సుల్లో డ్రైవర్లు తీరు మరీ దారుణంగా ఉంటోంది. ఈ వాహనాల డ్రైవర్లు సెల్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అచ్యుతాపురం జంక్షన్‌లో 24 గంటలూ పోలీసు పహారా ఉంటోంది.ఇకనైనా పోలీసులు నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా ఎరికిరెడ్డినాయుడు, ఆదమ్మల తీర్థం



ఎరికిరెడ్డినాయుడు, ఆదమ్మల ప్రతిమలకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, తదితరులు

రాంబిల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లాలం కోడూరు గ్రామంలో లాలం ఎరికిరెడ్డినాయుడు, ఆద మ్మల తీర్థమహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారి ప్రతిమలకు టీడీపీ రాష్ట్ర నేత దివంగత భాస్కరరావు కుటుంబ సభ్యులు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఆర్‌అండ్‌బీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, జనసేన పార్టీ నేత సుందరపు సతీష్‌కుమార్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ లాలం భవాని తదితరులు నివాళి ఘటించారు. ఈ సందర్భంగా లాలం కుటుంబీకులు ఎమ్మెల్యే, ఇతర నేతలను సన్మానించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకుఅన్నసమారాధననిర్వహించారు. క్రీడా పోటీల విజేతలకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో నేతలు బైలపూడి శ్రీరామరాసు, డీఎస్ఎన్‌రాజు, జనపరెడ్డి శ్రీనివాసరావు, లాలం చందు, ప్రముఖ వైద్యులు గొర్లె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ



కొత్తపాలెంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎక్సెల్ పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు

ఎలమంచిలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపాలిటీ కొత్తపాలెం వార్డులో సుమారు 80 మంది పేదలకు బుధవారం ఎక్సెల్ పరిశ్రమ యాజమాన్యం తరపున జీఎం అజయ్‌పాసే హెచ్‌ఆర్, రాజవేణి దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసినట్టు స్థానిక ఆలయ కమిటీ ఛైర్మన్ ఆడారి భాస్కరరావు తెలిపారు. పరిశ్రమ ఛైర్మన్ అశ్విన్ సిషరీప్ జన్మదినం సందర్భంగా ఈ వితరణ చేపట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ఎస్‌సిఎం, అప్పారావు, కౌన్సిలర్ రాపేటి సంతోష్, స్థానికులు ఆడారి అప్పారావు, దాడి వీరునాయుడు, రాపేటి సూరి అప్పారావు, జగన్నాధరావు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాంబిల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి కె.రఘునాథ్ అన్నారు. బుధవారం మండలంలోని కుమ్మరాపల్లి, రజాల గ్రామాల్లో పశుఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచదార్ల పశువైద్యాధికారి మాధురి, ఆయా గ్రామాల పెద్దలు, పాడిరైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

మునగపాక, జనవరి 22 (ఆంధ్రజ్యోతి: మండలంలో తోటాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో పలు విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థుల బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎన్.వి.ఎస్. సోమయాజులు మాట్లాడుతూ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎలమంచిలిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలో 9వ తరగతి చదువుతున్న ఎల్.హరిణి, వ్యాసరచన పోటీల్లో గోపిక రేష్మ మొదటి బహుమతులు సాధించగా 9వ తరగతి విద్యార్థిని బి.స్నేహిత ద్వితీయ బహుమతిని సొంతం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

ఎలమంచిలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం ఉదయం 10 గంటల నుంచి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మా పరిశ్రమల లాబ్స్‌లో ఉద్యోగాల భర్తీకి జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా. చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ బీఎస్సీ, కెమిస్ట్రీ పూర్తి చేసినఅభ్యర్థులతోపాటు డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వారు హాజరుకావచ్చన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

అచ్యుతాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో బుదవారం తిమ్మరాజుపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 130 మందికి పరీక్షలు నిర్వహించి 23 మందికి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో శివ బాపునాయుడు, బీశెట్టి రాము, కశిరెడ్డి అప్పల నాయుడు పాల్గొన్నారు.

చెరకు దిగుబడిపై సర్వే



సర్వే నిర్వహిస్తున్న ఏవో, సిబ్బంది

అచ్యుతాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక చెరకు దిగుబడి పొందాలని ఏవో సూర్యనారాయణ అన్నారు. తిమ్మరాజుపేటలో బుధవారం చెరకు దిగుబడిపై సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు ఆడారి కృష్ణ, శరగడం వెంకట అప్పారావుల నుంచి చెరకు పండిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో నీరజ, బీశెట్టి రాము, ఆడారి కృష్ణ, అర్జున్, అనంతరావు, శివలంక కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి అమర్ పుట్టినరోజు వేడుకలు



చిన్నారికి కేక్ తినిపిస్తున్న ఎంపీపీ గోవింద్

ఎలమంచిలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కొక్కిరాపల్లి ప్రేమసమాజంలోని అనాథ పిల్లలు మధ్య బుధవారం మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బోదెపు గోవింద్ ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు, నేత బొడ్డేడ ప్రసాద్ కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు , నిత్యావసరాలందించారు. నేత కొల్లి త్రినాథ్, సర్పంచ్‌లు ఎం.సత్యనారాయణ, మర్రిరాజు,నరసింగరావు, త్రినాధ్ పాల్గొన్నారు.

‘పేట’లో సమస్యల పరిష్కారానికి కృషి

- గ్రామ సభలో సర్పంచ్ గారా ఉషశ్రీ



పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సభ నిర్వహిస్తున్న సర్పంచ్ ఉషశ్రీ

పాయకరావుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని సర్పంచ్ గారా ఉషశ్రీ తెలిపారు. ఇక్కడి పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఆమె అధ్యక్షతన గ్రామ సభ ఏర్పాటైంది. ఈ సందర్భంగా మెయిన్‌రోడ్డులో ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని, పలు కాలనీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, అధిక సంఖ్యలో వీధి కుక్కలు, పందుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, పంచాయతీ షాపుల లీజు గడువు ఈ ఏడాదితో ముగుస్తున్నందున లీజును పొడిగించకుండా బహిరంగ వేలం నిర్వహించాలన్న తదితర సమస్యలు పరిష్కారం కోరుతూ పలువురు వినతిపత్రాలు అందజేశారు. వీటిపై స్పందించిన సర్పంచ్ మాట్లాడుతూ పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. గ్రామ సభలో ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలను పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సీహెచ్‌ఆర్‌కే వర్మ, పలువురు వార్డు సభ్యులు, పంచాయతీ ఉద్యోగులు కుమారస్వామి, శ్రీను తదితరులతో పాటు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పాడి సంపద పరిరక్షణకు ప్రభుత్వం కృషి



అన్నవరంలో గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి

కోటవురట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నవరం, తంగేడు, సన్యాసిరాజుపాలెం గ్రామాల్లో బుధవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోటవురట్ల పశు సంవర్ధకశాఖ ఏడీ పెట్ల నరేష్ మాట్లాడుతూ పాడి సంపద పరిరక్షణకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఇటువంటి శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం పలువు పశువులకు పరీక్షలు జరిపారు. గొర్రెలు, మేకలు, కోళ్లకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పాములవాక పశు వైద్యాధికారిణి డాక్టర్ హరిప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.రాయవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేజర్ పంచాయతీ తిమ్మాపురం పరిధి గోకులపాడులో బుధవారం చినగుమ్ములూరు పశు వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పశువులకు పరీక్షలు జరిపారు. గొర్రెలు, మేకలు, కోళ్లకు టీకాలు వేశారు. అనంతరం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ చేతుల మీదుగా రైతులకు నట్టల నివారణతో పాటు పశువులకు అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అద్దేపల్లి బాబూరావు, తిమ్మాపురం, గుర్రాజుపేట పశు సంవర్ధకశాఖ సహాయకులు పి.సునీల్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

12 రోజుల్లో.. మూడు లక్షల వాహనాలు పరుగు

- సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లి వచ్చే వారితో రద్దీగా జాతీయ రహదారి
- వేంపాడు టోల్ ప్లాజా వద్ద కోలాహలం
- ఇంత రద్దీ ఎన్నడూ చూడలేదని పలువురు విస్మయం



హైవేపై రాత్రి వేళ వాహనాల రద్దీ



వేంపాడు హైవే టోల్‌ప్లాజా

నక్కపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జాతీయ రహదారి కోలాహలంగా మారింది. సంక్రాంతికి వివిధ ప్రాంతాల్లో ఉంటున్న ఉద్యోగులు, వ్యాపారులు, వలస కూలీలు ఇలా.. అన్నివర్గాల ప్రజలు సొంత ఊళ్లకు తరలి వచ్చారు. పండుగ అనంతరం వారంతా తిరుగు ప్రయాణాలు కావడంతో గత కొద్ది రోజులుగా జాతీయ రహదారి వాహనాలతో రద్దీగా కనిపిస్తోంది. ఎన్నడూ లేనివిధంగా వేంపాడు హైవే టోల్‌ప్లాజా మీదుగా మూడు లక్షలకు పైగా వాహనాలు పరుగు తీశాయంటే రద్దీ ఏ మేరకు ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. దూర ప్రాంతాల్లో ఉన్న వారు తమ సొంత ఊళ్లకు ఈనెల పదో తేదీ నుంచే తరలివచ్చారు. అలాగే పండుగ ముగియడంతో సోమవారం, బుధవారాల్లో వారంతా పెద్ద సంఖ్యలో తిరుగు ప్రయాణమయ్యారు. ఫలితంగా హైవేపై వాహనాల తాకిడి చాలా ఎక్కువగా కనిపించింది. 12 రోజుల్లో వేంపాడు హైవే టోల్‌ప్లాజా మీదుగా దాదాపు మూడు లక్షల వాహనాలు పరుగు తీశాయి. ఇంతటి రద్దీని ఎప్పుడూ చూడలేదని టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపారు. అయితే ఫాస్ట్‌ట్రాక్ విధానం అమలులోకి రావడం వల్ల. సెకన్లలో టోల్ ఫీజు వసూలు కావడం వల్ల ట్రాఫిక్ అంతరాయం కూడా పెద్దగా లేదని చెప్పాలి.ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకూ రోజూ హైవేకు ఇరువైపులా సగటున 28 వేల వాహనాల రాకపోకలు సాగించాయి. ఎక్కువగా జనవరి 11, 12, 13 తేదీల్లో రికార్డు స్థాయిలో వాహనాలు పరుగులు తీశాయి. ఈ మూడు రోజుల్లో దాదాపు లక్ష వాహనాలు వేంపాడు హైవే టోల్‌ప్లాజా మీదుగా రాకపోకలు సాగించాయి. మిగిలిన పది రోజుల్లో మరో రెండు లక్షల వరకూ పలు రకాల వాహనాల రాకపోకలు కొనసాగాయి. మామూలు రోజుల్లో రోజుకు సగటున 14 వేల వరకూ వాహనాలు రాకపోకలు సాగిస్తాయని, సంక్రాంతికి మాత్రం రికార్డుస్థాయిలో హైవేపై పరుగులు తీశాయని టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపారు. సంక్రాంతి సీజన్‌లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నా వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్ అంతరాయం లేకుండా యాజమాన్యం చర్యలు చేపట్టడం విశేషం.

బాల్య వివాహాల వల్ల అనర్థాలపై అవగాహన



ఉప్పరాపల్లి లో మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి లోవరాజు

నక్కపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ఇక్కడి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. వెలుగు ఏపీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు 2006 బాల్య వివాహాల చట్టం, పోక్సో చట్టంపైవివరించారు. వివాహ వయస్సు రాకుండా ఆడపిల్లలకు వివాహాలు చేస్తే వారి భవిష్యత్ నాశనమవుతుందని చెప్పారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

ఉప్పరాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో...

ఎస్.రాయవరం : మండలంలోని ఉప్పరాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల వల్ల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. ఆడ పిల్లలకు పెళ్లి వయస్సు వచ్చిన తరువాత మాత్రమే వివాహం జరపాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల వారు అనేక సమస్యలు ఎదుర్కొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సంపత్, అరుణ, ఎంఎస్‌కే రూప, ఎంఎల్‌హెచ్‌పి శ్రావణి ప్రసన్న, రమణమ్మ పాల్గొన్నారు.

‘బల్క్‌డ్రగ్ పార్కుతో ప్రజలకు ఇబ్బందులు’



బల్క్‌డ్రగ్స్ కోసం కేటాయించిన భూముల్లో పనులను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నక్కపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజయ్యపేట పరిసర ప్రాంతాల్లో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత ప్రజల మనుగడ ప్రమాదకరంగా మారుతుందని, ప్రకృతి, పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. బుధవారం రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్కు భూముల్లో జరుగుతున్న పను లను ఆయన పరిశీలించారు. ఇతర ప్రాం తాల్లో బల్క్‌డ్రగ్ పార్కును ప్రజలు వ్యతిరే కిస్తే, దానిని నక్కపల్లి మండలంలో ఏర్పాటుచేయాలని నిర్ణయించడం దురదృష్టకరమన్నారు. ప్రజల మనోభావాలను, అభిప్రాయాలను ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బల్క్‌డ్రగ్ ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

‘మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు’

నక్కపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నక్కపల్లిలో గురువారం మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిసెట్టి వెంకటేశ్ తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ముందుగా ఉదయం హోం మంత్రి అనిత నేతృత్వంలో నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెల పంపిణీ చేపడతామన్నారు. అనంతరం ఆస్పత్రి హైవే జంక్షన్ నుంచి హోంమంత్రి నివాసం వరకూ పాదయాత్ర చేసి, అక్కడ కేక్ చేసి, బర్త్ డే వేడుకలను జరుపుతామని వివరించారు. నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలంతా హాజరుకావాలని కోరారు.

నూకాంబిక ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో గ్రామ పెద్దలు

ఎస్.రాయవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తిమ్మాపురంలో ఉన్న నూకాంబిక అమ్మవారి ఆలయంలో బుధవారం హుండీని లెక్కించారు. సర్పంచ్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో తొలుత హుండీని తాళాన్ని తెరిచారు. అనంతరం లెక్కించగా మొత్తం రూ.27,000 ఆదాయం వచ్చినట్టు గ్రామ పెద్దలు తెలిపారు.

మృతుని కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న మాజీ సర్పంచ్ నూకరాజు

నక్కపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జానకయ్యపేటలో ఇటీవల మృతిచెందిన యువకుడు ధూళి అప్పలరాజు కుటుంబానికి పలువురు బాసటగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం గ్రామానికి చెందిన యువకులు, వార్డు సభ్యులు, పెద్దలంతా కలిసి రూ.51,500ల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. గ్రామ పెద్ద మాజీ సర్పంచ్ కురందాసు నూకరాజు, ఉప సర్పంచ్ నానాజీ, వార్డు సభ్యులంతా కలిసి ఈ మొత్తాన్ని అందించారు. భవిష్యత్‌లో కూడా ఈ కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.



మహాబోధి ఆలయంలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ దంపతులు

మహాబోధి ఆలయాన్ని సందర్శించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు

నర్సీపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు, డిప్యూటీ స్పీకర్ కె.రఘురామ కృష్ణంరాజు దంపతులు మహాబోధి ఆలయాన్ని సందర్శించారు. బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో నిర్వహించిన 85వ అఖిల భారత శాసన సభాపతుల మహాసభలో వారు పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం ప్రపంచ ప్రసిద్ధి గాంచిన బోధ్ గయా ప్రాంతంలో స్పీకర్ దంపతులు పర్యటించారు. బుద్ధుడు ధ్యానం చేసి జ్ఞానాన్ని పొందిన బోధి వృక్షం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మహా బోధి వంటి ఆలయాలు భారత దేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని చెప్పారు. ఇక్కడ వాతావరణం మనసుకు ఆహ్లాదాన్ని, అమితానందాన్ని ఇస్తుందన్నారు. ఈ పర్యటనలో ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

నాణ్యతతో నిర్మాణాలు పూర్తిచేయండి

▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నిర్మాణాలను నాణ్యతతో సకాలంలో పూర్తిచేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఆదేశించారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌ను బుధవారం సందర్శించారు. ప్రాంగణంలో నిర్మించిన బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధి పథకం నిధులు రూ.38.63 లక్షలతో జడ్పీ హైస్కూల్‌కు నిర్మించనున్న ప్రహరీగోడలకు సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వశిక్ష అభియాన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బలక్ష్మి, స్కూల్ హెచ్‌ఎం పద్మావతితో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంఈవోలు కూనిరెడ్డి సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, క్లస్టర్ ఇన్‌చార్జి కె.సూర్యనారాయణ, నాయకులు డి.నరసింహమూర్తి, భూపతి అప్పలరాజు, సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, పూడి నారాయణ మూర్తి, దాడి ఎరుకునాయుడు, బి.అక్కునాయుడు, వి.పైడంనాయుడు, యడ్ల రమేశ్, వంటాకు శ్రీను, దొగ్గ ఉమాశంకర్, రెడ్డి రామస్వామి పాల్గొన్నారు.

మరిడిమాంబను దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి: మండలంలోని ములకలాపల్లి గ్రామదేవత మరిడిమాంబను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, నాయకులు వెంకన్నదొర, తమడాన ప్రసాదు, కొమార బాబూరావు, పాత్రునాయుడు ఉన్నారు.

టీడీపీలో 20 కుటుంబాలు చేరిక



ఎమ్మెల్యే బండారు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కె.కోటపాడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్లి పంచాయతీ శివారు చింతపాలెం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ఆరు నెలల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరు నచ్చి వైసీపీ నుంచి టీడీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. చింతపాలెం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ లక్ష్మి, సబ్బవరపు రామకృష్ణ, చిరికి ప్రసాద్, సబ్బవరపు పైడంనాయుడు, బోళెం కోటేశ్వరరావు, శీరంరెడ్డి దేముడు, సబ్బవరపు అప్పలనాయుడు తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, నాయకులు బోళెం బుల్లిదొర, శీరంరెడ్డి సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, పూడి నారాయణమూర్తి, దాడి ఎరుకునాయుడు, కన్నూరు సూర్యనారాయణ, బొడ్డు అక్కునాయుడు, వంటాకు శ్రీను పాల్గొన్నారు.

కోర్టు భవనాల పూర్తికి సహకరించరూ..

మంత్రి రవీంద్రకు బార్ అసోసియేషన్ న్యాయవాదుల వినతి



మంత్రి రవీంద్రకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

చోడవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సమస్యలతో పాటు కోర్టు భవనాల నిర్మాణాల పూర్తికి సహకరించాలని స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. ఈ మేరకు బుధవారం మండల పర్యటనకు వచ్చిన మంత్రి రవీంద్రను బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాండ్రేగుల డేవిడ్, గొర్లె కృష్ణవేణిల ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే కోర్టు భవనాల నిర్మాణంలో చోటు చేసుకున్న జాప్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ నాయకులు గూనూరు లక్ష్మీనారాయణ, చీపురుపల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం.. నిరుపయోగం



పనిచేయని ఫ్లోరైడ్ తాగునీటి పథకం

మాకవరపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో నినగరం గ్రామంలో ఎన్టీఆర్ శుద్ధ జల తాగునీటి పథకం నిరుపయోగంగా మారిపోయింది. జి.కోడూరు పంచాయతీ శివారు నగరం గ్రామంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏడు లక్షల రూపాయలతో ఎన్టీఆర్ శుద్ధ జల తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వం ఉన్న ఐదేళ్ల పాటు ఈ పథకం ఎంతో బాగా పనిచేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో తాగనీటి పథకం వైపు అధికారులు కనీసం కన్నెత్తి చూడలేదు. దీంతో గత మూడేళ్లగా ఈ పథకం పూర్తిగా నిర్వీర్యమైంది. ఫలితంగా గ్రామ ప్రజలు తాగునీటి కోసం మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పథకానికి మోక్షం కలుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కష్టాలు తీరుస్తాం

▸ రైతులు, కార్మికుల బకాయిలపై సీఎంకు నివేదిక
▸ ఫ్యాక్టరీ అభివృద్ధికి ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు
▸ ఏడాది పొడవునా గోవాడ పనిచేసేలా చూస్తాం
▸ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



విత్తన గిడ్డంగి పనులపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

చోడవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కష్టాలు తీరుస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, గనులు, భూగర్భ జల, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మండల పర్యటనలో భాగంగా బుధవారం గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులు, ఫ్యాక్టరీ ఎండీతో ఆయన సమావేశమయ్యారు. ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు రైతులు, కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. చోడవరం, మాడుగుల ప్రాంతాలకు ఏకైక ఆధారంగా ఉన్న గోవాడను కాపాడకపోతే ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు. గోవాడ శాశ్వతంగా అభివృద్ధి చెందేలా డిస్టిలరీ, లేదా ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు గోవాడకు ఆర్థిక సాయం అందించేలా చూడాలని కోరారు. అలాగే ఫ్యాక్టరీకి, రైతులు, కార్మికులకు రావాల్సిన బకాయిలు గురించి ఎండీ సన్యాసినాయుడు, ఎమ్మెల్యే రాజు మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి రవీంద్ర స్పందిస్తూ ఫ్యాక్టరీ స్థితిగతులపై త్వరలోనే సీఎంకు నివేదిక ఇస్తానని చెప్పారు. రైతులు, కార్మికుల బకాయిలు తీర్చడంతో పాటు ఫ్యాక్టరీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. భవిష్యత్తులో ఇథనాల్‌కి గిరాకీ ఉన్నందున గోవాడలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు ఏడాది పొడవునా విద్యుత్ ఉత్పత్తి చేసి ఆదాయం పొందేలా చూసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అంతకు ముందు కార్మికుల సమస్యలను కార్మిక సంఘం నాయకులు భాస్కరరావు మంత్రికి వివరించారు.

అభివృద్ధికి సంపూర్ణ సహకారం

కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నదని ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించారు. మండలంలోని గంధవరంలోని విత్తన గిడ్డంగి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విత్తనగిడ్డంగి ద్వారా రైతులకు అందించే సేవలు, విత్తనాల శుద్ధి తదితర అంశాలను విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం గిడ్డంగికి రహదారి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలకు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే రాజు మంత్రిని కోరగా, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జేసీకి మంత్రి సూచించారు. అనంతరం పట్టణంలోని అసంపూర్తిగా నిలిచిపోయిన రైతు బజారు, రెవెన్యూ కార్యాలయం భవనాలను పరిశీలించిన మంత్రి, భవనాల నిర్మాణం పూర్తికి అవసరమైన నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. అంతకు ముందు గంధవరంలో మంత్రికి టీడీపీనేత పల్లా అర్జున ఆధ్వర్యంలో మహిళలు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఆర్డీవో అయిషా, ఎంపీడీవో అంజనేయులు, తహసీల్దార్ అంబటి రామారావు, కూటమి నాయకులు గేదెల సత్యనారాయణ, గూనూరు మల్లునాయుడు, కనిశెట్టి మత్స్యరాజు, పల్లా అర్జున్, సిరిపురపు రమేశ్, గూనూరు మూలినాయుడు, పూతి కోటేశ్వరరావు, మజ్జి గౌరీశంకర్, బొడ్డేడ రామునాయుడు, ఏడువాక లక్ష్మణకుమార్, దేవరపల్లి వెంకట అప్పారావు, సకురు కోటేశ్వరరావు, సేనాపతి శ్రీనివాసరావు, మల్లి బాబు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా చూడండి

▸ టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ
▸ కార్యకర్తలు అధైర్య పడొద్దు.. త్వరలో నీరు-చెట్టు బిల్లుల మంజూరు



మర్రిపాలెంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

నాతవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా కార్యకర్తలు చూడాలని టీడీపీ మండ అధ్యక్షుడు నందిపల్లి వెంకట రమణ సూచించారు. బుధవారం మర్రిపాలెం గ్రామంలో పార్ట కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగలో మంజూరైన అభివృద్ధి పనులను ఫిబ్రవరి 15వ తేదీలోగా పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు బిల్లులు మంజూరు కాకపోవడంతో చాలా మంది నష్టపోయి ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎవ్వరూ అధైర్యపడొద్దని, త్వరలో నీరు-చెట్టు బిల్లులు మంజూరవుతాయని ఆయన చెప్పారు. అలాగే సరుగుడు జలపాతానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు రోడ్డు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ తాండవ రిజర్వాయర్ పరిధిలోని పంట కాలువలను కూడా అభివృద్ధి చేసుకోవాల్సి అవసరం ఉందన్నారు. దీనికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేముడు, తాండవ డిస్ట్రిబ్యూటి సంఘం అధ్యక్షుడు పారుపల్లి దాసు. ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొండ్రు మరిడియ్య, నాయకులు అపిరెడ్డి మాణిక్యం, ఇటంశెట్టి సీతారామ్మూర్తి, శెట్టి లోవ, కాశపు నూకరాజు, వనిమిన సూర్యారావు, అపన దివాణం తదితరులు పాల్గొన్నారు

నేడు జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

చీడికాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జైతవరం గ్రామంలో గురువారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నామని ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య, ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాలనాయుడులు బుధవారం తెలిపారు. శ్రీతాళమాంబ అమ్మవారి తీర్థం పురస్కరించుకొని మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనేవారు మధ్యాహ్నం 2 గంటల్లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

పశువైద్య శిబిరాలు వినియోగించుకోండి

నర్సీపట్నం అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉచితంగా నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు రాంబాబు సూచించారు. మండలంలోని గురందరపాలెంలో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. శిబిరంలో 35 పశువులకు గర్భకోశ చికిత్సలు చేసినట్టు ఈ సందర్భంగా ఆయన చెప్పారు. అలాగే 600 గొర్రెలు, మేకలు నట్టల నివారణ మందులను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి కె.పుష్ప, సిబ్బంది కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

చీడికాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో హేమసుంద్రరావు బుధవారం తెలిపారు. ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన సూచించారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

చోడవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కళాశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఏఎస్‌ఐ గోవిందరావులు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు రహదారి భద్రతపై సూచనలు చేశారు. కార్యక్రమంలో వివేకానంద కళాశాలల విద్యార్థులు, నెహ్రూ యువకేంద్రం ప్రతినిధులు ప్రసన్నకుమార్, వినయ్‌కుమార్, జ్ఞానదీప తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

రావికమతం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో డోలవానిపాలెం గ్రామంలో మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొత్తకోట ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. డోలవానిపాలెంలో మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు బుధవారం సిబ్బందితో దాడిచేయగా 31 క్వాటర్ బాటిల్ సీసాలతో ఓ వ్యక్తి పట్టుబడ్డాడని చెప్పారు. అతన్ని అరెస్టు చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

రోలుగుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వూరు గ్రామంలో రామాలయం ప్రథమ వార్షికోత్సవానికి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కాంతమ్మ, స్థానిక నాయకుడు యర్రంశెట్టి రాజారావు తదితరుల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి పెదనందిపల్లిలో తీర్థ మహోత్సవాలు

దేవరాపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదనందిపల్లి కొండపై వెలసిన విజయ వెంకట సత్యనారాయణమూర్తి స్వామి తీర్థ మహోత్సవాలను గురువారం నుంచి రెండు రోజులు పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరవుతారని చెప్పారు. ఈ ఏడాది మెట్ల దారి పక్క నుంచి దారి ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక స్థలంలో వాహనాలు నిలిపేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

పాఠశాలలను సందర్శించిన ఎమ్మెల్సీ రఘువర్మ

మాడుగుల రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొటివాడ అగ్రహారం, గాదిరాయి, ఒమ్మలి, కింతలి, దిబ్బూరు, తాటిపర్తి పాఠశాలలను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ బుధవారం సందర్శించారు. ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకు సహకరించాలని కోరారు. ఏపీటీఎఫ్ ప్రతినిధులు వెంకటపతిరాజు, దుర్గాప్రసాద్, జగదీశ్, క్రిష్ణయ్య, చందనవర్మ, సూర్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారణ చేపడుతున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్

గొలుగొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చోద్యం పీఏసీఎస్‌లో నిధుల దుర్వినియోగంపై బుధవారం విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి వేతన అమలుపై జీవో 151 ప్రకారం అమలు చేసిన వేతనం కంటే అధికంగా రూ.16 లక్షలు దుర్వినియోగం చేశారన్న అభియోగంపై జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.సత్యనారాయణ విచారణ చేపట్టారు. విచారణ నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామని ఈ సందర్భంగా విలేకరులకు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ కె.జగన్నాథం, ఫిర్యాదుదారుడు పిట్టా చలపతి, కార్యదర్శి రాజు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



ఫ్లడ్ లైట్ల వెలుగులో జరుగుతున్న కబడ్డీ పోటీలు

దేవరాపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేట శివారు సీతంపేటలో మరిడిమాంబ గ్రామ దేవత తీర్థం సందర్భంగా నిర్వహించిన కబడ్డీఈ పోటీలు బుధవారం రాత్రి ఉత్సాహంగా జరిగాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పలు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. బుధవారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహించిన పోటీలు రసవత్తరంగా జరిగాయి. గురువారం ఉదయం ఫైనల్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

మరుపాకలో చెరువు పూడికతీత పనులు



ఎలగబంద చెరువులో చేపడుతున్న పూడికతీత పనులు

రావికమతం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో మరుపాక ఎలగబంద చెరువు పూడిక తీత పనులకు బుధవారం చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో మంజూరైన రూ.10 లక్షలతో ఈ పనులు ప్రారంభించారు. ఆయకట్టు భూములకు సాగునీరే లక్ష్యంగా చెరువు పూడిక తీత పనులు నిర్వహించాలని ఈ సందర్భంగా మరుపాక ఎంపీటీసీ సభ్యుడు ముచ్చా సూర్యనారాయణ సూచించారు. సాగునీటి వనరుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యవ ఇస్తున్నారన్నారు. ఈ చెరువు అభివృద్ధితో గ్రామంలో కూలీలకు పని కల్పించడంతో పాటు 200 ఎకరాలకు సాగునీరు ఢోకా లేకుండా అందుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు జెర్రిపోతల రాంబాబు, టీడీపీ నాయకుడు గొర్లె సత్తిబాబు, ఉపాధి పథకం కూలీలు పాల్గొన్నారు.

విప్పలపాలెంలో రైతులకు శిక్షణ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీదేవి

కృష్ణాదేవిపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని విప్పలపాలెం గ్రామంలో రబీలో సాగుచేసే వివిధ రకాల పంటలపై బుధవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు టీ.శ్రీదేవి అపరాలలో యాజమాన్యం పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే వరిలో నారుమడి దశలో సూక్ష్మ పోషకమైన జింక్‌వాడుక, వాటి ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఏడీఏ కె.ఝాన్సీలక్ష్మి, మండల వ్యవసాయాధికారి కెజసుధారాణి, గ్రామ సర్పంచ్ నల్లబిల్లి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు లగుడు నానిబాబు, వ్యవసాయ సిబ్బంది , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు కోడి పందెంరాయుళ్ల అరెస్టు

నాతవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైబీపట్నం సమీపంలో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ సిహెచ్.భీమరాజు తెలిపారు. వీరి నుంచి మూడు కోడి పుంజులు రూ.527 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

ఇంటర్వ్యూ..

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

-శ్రీనివాసరావు, తహసీల్దార్



మండలంలో ఏ గ్రామం నుంచైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్టు ఫిర్యాదులు వస్తే తక్షణమే కఠిన చర్యలు చేపడతాం. వీఆర్‌వోల ద్వారా ప్రభుత్వ భూములను ఎప్పటికప్పుడు పరిశీలిస్తాం. రీ సర్వే పూర్తి చేసి త్వరితగతిన భూముల సమస్యలను పరిష్కరిస్తాం. గతంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో వచ్చిన వినతులపై సర్వే చేసి దాదాపు 50 శాతం పరిష్కరించాం.

ప్రశ్న: ఇప్పటివరకూ ఎన్ని రెవెన్యూ గ్రామాలు రీ సర్వే చేశారు?

జవాబు: మండలంలోని 19 గ్రామ రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి భూ సమస్యలు పరిష్కరించాం.

ప్ర: రీ సర్వే చేయాల్సిన రెవెన్యూ గ్రామాలు ఎన్ని ఉన్నాయి?

జ: రీ సర్వే పూర్తి చేయాల్సినవి 16 రెవెన్యూ గ్రామాలలు వున్నాయి. ఈ నెల 20వ తేదీన గుండుపాలలో రీ సర్వే ప్రారంభించాం. త్వరితగతిన రీ సర్వే పూర్తి చేసి భూ సమస్యలు పరిష్కరిస్తాం.

ప్ర: మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

జ: మండలంలోని ఏ గ్రామం నుంచైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్టు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందిస్తే తక్షణమే కఠిన చర్యలు చేపడతాం. వీఆర్‌వోల ద్వారా ప్రభుత్వ భూములను ఎప్పటికప్పుడు పరిశీలించే విధంగా చర్యలు చేపట్టాం.

ప్ర: గతంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులపై తీసుకున్న చర్యలు ఏమిటి?

జ: గతంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన వినతుల్లో 50 శాతం సర్వే చేసి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాం. మిగిలినవి త్వరలోనే పరిష్కరిస్తాం.

-గొలుగొండ, ఆంధ్రజ్యోతి

బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు మంజూరు

గొలుగొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసినట్టు ఎంపీడీవో మేరీరోజీ బుధవారం తెలిపారు. మండలంలోని బీసీ, కాపు కార్పొరేష్‌ల ద్వారా వివిధ రకాల 61 యూనిట్లు మంజూరైనట్టు చెప్పారు. ఆయా బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు త్వరలో రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. దీనికి సంబంధించి ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలో స్వీకరిస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు అందించాలని కోరారు.

పాడి రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు

నాతవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వనున్నట్టు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. గొలుగొండపేటలో బుధవారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో మాట్లాడుతూ పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులు పశువుల దాణా కొనుగోలు, ఇతర అవసరాలకు రూ.30 వేల వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. అలాగే పాడి రైతులకు ప్రభుత్వం గోకుల శాలలను మంజూరు చేస్తున్నదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం వైద్య శిబిరంలో 30 పశువులకు గర్భకోశ చికిత్సలు, పది పశువులకు సాధారణ చికిత్సలు, 20 పశువులకు డీవార్మింగ్ చేశారు. ఈ శిబిరంలో పశు వైద్యులు మోక్షరెడ్డి, సర్పంచ్ ఎం.వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు టి.సత్యనారాయణ, టీడీపీ నాయకులు జి.చిట్టిబాబు, సిబ్బంది అభిరాం, చిట్టిబాబు పాల్గొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం రేపు

నాతవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చినగొలుగొండపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చంద్రమౌళి తెలిపారు. చినగొలుగొండపేట, గొలుగొండపేట, వెదురుపల్లి, సరుగుడు, ఎస్‌బీ పట్నం పీకే.గూడెం, జగ్గంపేట తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేస్తున్నట్టు చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

దళిత కాలనీ శ్మశానవాటికకు రోడ్డు నిర్మించాలని వినతి

గొలుగొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం గొలుగొండ దళిత కాలనీలోని శ్మశానానికి రోడ్డు నిర్మించాలని కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం అందించారు. జగనన్న లేఅవుట్‌కు ఇదే రహదారి కావడంతో సాగుదారుడు ఆక్రమించుకుంటున్నాడని, ఆక్రమణలు తొలగించి రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసిపల్లి చినప్పారావు, దళిత నాయకుడు సరమండ వీరబాబు, జనసేన నాయకుడు బోయిన చిరంజీవి, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం

» అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులతో మారుమూల గ్రామాలకు రహదారి సదుపాయం కల్పించాల్సినా, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు ఎందుకు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ప్రశ్నించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కనీస రహదారి సౌకర్యం లేక మారుమూల గ్రామాల్లో గర్భిణులు, రోగులను డోలీ మోతతో సమీప ఆస్ప త్రులకు తీసుకురావాల్సిన దుస్థితి నెలకొంటోందన్నారు. ఈ స్థితిలో ఉపాధి పథకం నిధులు అందుబాటులో ఉన్నా అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో సక్రమంగా వినియోగించలేకపోతున్నారని ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. పండ్లతోటలు, భూమి అభివృద్ధి పనులు చేపడుతన్నట్టుగానే మారుమూల గ్రామాలకు కనీస మట్టి రహదారి సౌకర్యమైనా కల్పించాలన్నారు. గ్రామాలలో పనులు లేక గిరిజనులు వలసబాట పడుతున్నారన్నారు. అనంతరం పట్టణాల్లో తీవ్ర అనారోగ్యం పాలైకొంత మంది మృత్యువాత పడుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండాలంటే వారి ఉపాధి పథకం ద్వారా వారికి పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సభ్యురాలు రోష్ని, ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, పీడీ విద్యాసాగర్, డీవీవో నిర్మాలాదేవి , సర్పంచులు , ఎంపీటీసీ సభ్యులు, ఉపాధి సిబ్బంది, ఏఈ టీడబ్ల్యూ ,పీఆర్ ఏఈ పాల్గొన్నారు.

నిలువ నీడ లేకుండా చేశారు

» జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బస్సు షెల్టర్లు తొలగింపు » గ్రామాల్లో ప్రయాణికుల పాట్లు



తోటలూరులో బస్సు షెల్టర్ లేని దృశ్యం

కొయ్యూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 516- ఈ నిర్మాణం కోసం బస్సు షెల్టర్ల తొలగించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కాకరపాడు, పిట్టచలం, నడింపాలెం, లొద్దిపాకలు, రేవడివీధి కూడలి రావణాపల్లి, తోటలూరు, వైఎస్‌పాకలు కూడలి, వలసంపేట, గాదిగుమ్మి, రామరాజుపాలెం, పి. మాకవరం, నల్లగొండ, నడింపాలెం, కాట్రగెడ్డ తదితర గ్రామాల వద్ద ప్రయాణికులు సేద తీరేందుకు వీలుగా బస్సు షెల్టర్లు ఉండేవి. రోడ్డు విస్తరణలో వీటిని సమూలంగా తొలగించారు. దీంతో వర్షాకాలంలో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణీకులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వేసవి సమీపిస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా ఉండే పరిస్థితులు నెలకొన్నాయి. బస్సుల కోసం మండుటెండలో వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాలలో పక్కన ఇళ్ల వద్ద లేదా మరే ఇతర దుకాణాల వద్దనైనా తలదాచుకోవాల్సి ఉంటుంది. రేవడివీధి, వైఎస్‌పాకలు కూడలి, లుబ్బుర్తిలలో కూడళ్ల గ్రామాలకు దూరంగా ఉండంతో ప్రయాణికులు నిల్చోవడానికి వీలుకాని దుస్థితి. ప్రస్తుతం జాతీయ రహదారి పనులు దాదాపు పూర్తయ్యాయి. అయినా, బస్ షెల్టర్లు నిర్మాణాలపై సంబంధిత కాంట్రాక్టరు చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా తొలగించిన బస్ షెల్టర్లు స్థానంలో కొత్త నిర్మాణాలు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై గడిచిన నెలరోజుల కిందట కలెక్టరు దినేశ్‌కుమార్ ఇటీవల డౌనూరు వచ్చిన సందర్భంగా పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకువెళ్లగా, త్వరలో బస్‌షెల్టర్లు నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయినా, నేటికీ చర్యలు లేవు. ఇకనైనా బస్ షెల్టర్లు నిర్మాణాలు పూర్తికి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

రహదారి పనుల్లో నాణ్యతా లోపంపై ఎంపీపీ ఆగ్రహం

» కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



గిన్నెలకోట-పిట్టలబొర్ర రోడ్డుపై కాక్రిట్ లేకుండా నిర్మించిన కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీపీ వరహాలమ్మ తదితరులు

పెదబయలు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మండల పరిధిలో మారుమూల పంచాయతీలకు నిర్మించిన రహదారుల నిర్మాణాల్లో నాణ్యత కొరవడినట్టు స్థానిక ఎంపీపీ బొండా వరహాలమ్మ ఆరోపించారు. మంగళవారం ఆమె వైస్ ఎంపీపీ రాజుబాబు, మండల ఎంపీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు బొంజుబాబుతో కలసి జామిగూడ, గిన్నెలకోట పంచాయతీలను సందర్శించారు. రూడకోట నుంచి జామిగూడ, గిన్నెలకోట నుంచి పిట్టలబొర్ర గ్రామాలకు నిర్మించిన బీటీ రోడ్డులను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. ఈ రహదారులు నిర్మించి ఏడాది కాకుండానే పెచ్చులు ఉడిపోవడంపై కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిట్టలబొర్ర గ్రావనికి వెళ్లేందుకు రోడ్డు నిర్మించినా కల్వర్టును కాంక్రీట్ లేకుండానే ఒక అడుగు లోతు కూడా లేకుండా నిర్మించడంపై ఆమె విస్మయం వ్యక్తంచేశారు. ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేస్తే ఇలా నాసిరకంగా నిర్మాణాలు చేపట్టారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ స్పందించి ఈ రోడ్లు నిర్మించిన కాంట్రాక్టర్లు, అలాగే పర్యవేక్షించిన సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రహదారులు పునర్నించాలని కోరారు.

శిశు మరణాలను వైసీపీ నేతలు రాజకీయం చేయడం తగదు

టీడీపీ పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



చింతపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో వైద్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు టీడీపీ పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గిరిజన ప్రాంతంలో ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్యనిపుణులు పోస్టులు భర్తీకి నోచుకోలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైద్యుల ఖాళీలను భర్తీకి కార్యాచరణ ప్రారంభించిందన్నారు. గిరిజన ప్రాంతంలో డోలీ మోతలను నియంత్రణకు ప్రభుత్వం ప్రతి గ్రామానికి రహదారుల నిర్మాణాలకు నిధులు కేటాయించినట్టు చెప్పారు. గర్భిణుల కోసం వసతి గృహాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు.చింతపల్లి మండలం వాముగెడ్డలో ముగ్గురు శిశువులు మరణిస్తే వైసీపీ నాయకులు రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. అస్వస్థతకు గురైన శిశువులను చింతపల్లి ఏరియా ఆస్పత్రి, కేజీహెచ్‌లోనూ వైద్యులు మెరుగైన చికిత్స అందించినా, ఆరోగ్య పరిస్థితి విషమించి ఈ శిశువులు మృతి చెందారన్నారు. ఈ మరణాలు సంభవించిన వెంటనే గ్రామాన్ని పత్యేక వైద్య బృందం సందర్శించిందన్నారు. వైద్యనిపుణులు అధ్యయనం చేస్తున్నారన్నారు. అయితే వైసీపీ నాయకులు, పాడేరు ఎమ్మెల్యే శిశు మరణాలపై కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సమస్యలను చట్ట సభల్లోకి తీసుకువెళ్లాలని ఆదివాసీలు ఎన్ను కుంటే వైసీపీ ఎమ్మెల్యే శాసన సభకు ఎగనామం పెడుతున్నారన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌తో టీబీ నిరోధం



ఉప్ప పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ సాధన

పాడేరురూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బీసీజీ వ్యాక్సినేషన్ ప్రతీ ఒక్కరూ వేసుకోవాలని, దీని వల్ల టీబీ వ్యాధిని అరికట్టవచ్చునని జిల్లా ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ సాధన అన్నారు. బుధవారం ఆమె హుకుంపేట మండలం ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. మందుల గది, డెలివరీ రూం, వైద్య సేవలను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంతారి పంచాయతీ కేంద్రంలో కేన్సర్, టీబీ కోసం ప్రజలకు అవగాహన కల్పించారు. బండిచింతలో టీబీ మందులు వాడుతున్న రోగులు మం దులు సక్రమంగా వాడేలా వైద్యులు పర్యవేక్షించాలని సూచించారు. బీసీజీ వ్యాక్సినేషన్‌ను 18 ఏళ్లు పైబడిన ప్రతీ ఒక్కరూ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మోహన్, కిశోర్, సర్పంచ్ అప్పలనాయుడు, టీబీ కో-ఆర్డినేటర్ శేషగిరి వెంకటేశ్వర్లు, టీబీ సూపర్‌వైజర్ కె.సదానందం, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ ఎం.ధనరాజు పాల్గొన్నారు.

చిన్నారులకోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు



అనంతగిరిలో ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ బుధవారం పరిశీలించారు. 0 వయసు గలవారి నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారుల కోసం ఈ ఆధార్ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారులకు ఆధార్ కేంద్రానికి తీసుకువచ్చేలా అంగన్‌వాడీకార్యకర్తలు కృషిచేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ ఆధార్ తప్పసరి అని, బయోమెట్రిక్ అప్‌డేట్, ఫోన్ నంబరు లింకు, న్యూ ఎన్‌రోల్‌మెంట్ తదితర సేవలందిస్తున్నట్టు వివరించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



15 రోజులుగా కనిపించని సురేంద్ర (ఫైల్‌ఫొటో)

సీలేరు, జనవరి 22, (ఆంధ్రజ్యోతి) : జీకే వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ కోరాపల్లికి చెందిన మఠం సురేంద్ర (27) గత 15 రోజులుగా కనిపించడం లేదని భార్య దీపాలమ్మ సీలేరు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. వివరాలివి... ఈ దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగిందని, వీరికి ఇద్దరు అమ్మాయిలు, బాబు ఉన్నారు. సురేంద్ర తమస్వ గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ , ఏపీ ఫైబర్ నెట్ వర్క్‌లో లో ధారకొండ, దుప్పులవాడల్లో టెక్నీషియన్‌గా పని చేస్తుండేవారు. అయితే, 15 రోజులుగా అతని ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్టు దీపాలమ్మ పేర్కొన్నారు. పిల్లలు తండ్రిపై బెంగ పెట్టుకున్నట్టు ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్‌ఐ రవీంద్ర వద్ద ప్రస్తావించగా... దీపాలమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి సురేంద్ర ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

గిరిజనుల అభివృద్ధే ధ్యేయం

» ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా



గడుగుపల్లిలో గిరిజనులకు రగ్గులు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా తదితరులు

పెదబయలు, జనవరిరి (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధే పోలీసు శాఖ ఆకాంక్ష అని చింతపల్లి ఏఎస్పీ, ప్రస్తుత పాడేరు ఇన్‌చార్జి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా అన్నారు.మంగళవారం మండలంలోని కిముడుపల్లి పంచాయతీలో చేయూత అనే కార్యక్రమం నిర్వహించారు. గడుగుపల్లి గ్రామంలో పరిసరాల్లోని 250 మంది గిరిజనులకు కెన్, గ్రీన్ సంస్థ సహకారంతో చలి నుండి ఉపశమనానికి రగ్గులు,దుప్పట్లు,చీరలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా మాట్లాడుతూ గిరిజనుల గంజాయి సాగును వీడి పంప్రదాయ పంటలను పండించాలని కోరారు. గంజాయి రవాణా చట్ట రీత్యా నేరమని అన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. పదో తరగతి వరకు చదివి మధ్యలో చదువు మానేస్తున్నారని ఆయన విచారం వ్యక్తంచేశారు. గిరిజన విద్యార్థులు ఉన్న చదువులుచదివి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సైబర్ మోసాలపై అ ప్రమత్తంగా ఉండాలని కోరారు. అపరిచిత వ్యక్తులకు తమ వ్యక్తిగత సమాచారాన్ని తెలియజేయవద్దన్నారు. గిరిజనులకు ఎటువంటి కష్టం వచ్చినా తాము అండగా ఉంటామన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, టీ షర్టులు పంపిణీ

అలాగే, సీతగుంటలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల -1,2లో గల విద్యార్థులకు కెన్,గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో ఏఎస్పీ పుస్తకాలు,పెన్నులు, టీ షర్టులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ఇన్‌కం ట్యాక్స్ అధికారి రవిశంక్ నారాయణ్, సీఆర్పీఎఫ్ 198 బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ కిశోర్, జి. మాడుగుల సీఐ శ్రీనివాస్, పెదబయలు ఎస్‌ఐ రమణ, వైస్ ఎంపీపీ సోనే, సర్పంచ్ శోభారాణి పాల్గొన్నారు.

‘బేటీ బచావో.. బేటీ పడావో’ పదేళ్ల వేడుక



ఆడపిల్లల సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పాడేరురూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బేటీ బచావో బేటీ పడావో (ఆడపిల్లలను రక్షించండి-ఆడపిల్లలకు చదువుచెప్పండి) కార్యక్రమానికి పదేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వెబ్ క్యాస్ట్ లింక్ ద్వారా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక కార్య క్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ, స్కిల్ డెవలప్‌మెంట్, అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, కల్చర్, యూత్ అండ్ స్పోర్ట్స్ తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొని బాలికల సంక్షేమంపై ప్రసంగించారు. మహిళలకు రక్షణ, విద్యకు మద్దతుగా నిలవాలన్నారు. ఆడపిల్లలను సమాజంలో అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కల్పిస్తూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉం దన్నారు. భ్రూణ హత్యలకు పాల్పడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఆడపిల్లలను క్రీడా రంగంలో కూడా ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఆడపిల్లలను రక్షిస్తాం! ఆడపిల్లలను చదివిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

మాతా, శిశు మరణాల నియంత్రణకు చర్యలు



చిన్నారిని పరీక్షిస్తున్న చిన్నపిల్లల వైద్యనిపుణులు ప్రభావతి, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

చింతపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో మాతా శిశు మరణాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్టు డీఎంహెచ్‌వో జమాల్ బాషా అన్నారు. బుధవారం శిశు మరణాలు సంభవించిన వాముగెడ్డ గ్రామంలో జర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఏరియా ఆస్పత్రి పిడియాట్రిక్స్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. ప్రభావతి చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వం మాత, శిశు మరణాలపై సీరియస్‌గా తీసుకుంటుందన్నారు. దీంతో వైద్యాధికారులు, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవం పొందేలా ఏ ర్పాటు చేస్తున్నామన్నారు. శిశువులకు క్రమంగా టీకాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గిరిజనులు పసర మందులు, నాటు వైద్యానికి దూరంగా ఉండేందుకు చైతన్యం కల్పిస్తున్నామన్నారు. పీహెచ్‌సీ వైద్యులు, పారామెడికల్ ఉద్యోగులు రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈకార్యక్రమంలో జర్రెల వైద్యాధికారి మణిదీప్, ఎంపీహెచ్‌వో కె. రామకృష్ణ, పారామెడికల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐదు మండలాల్లో రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్‌ల మరమ్మతులు నేపథ్యంలో 24వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్‌ఎం.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుకుంపేట సబ్ స్టేషన్ పరిధిలోని మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. జి.మాడుగుల మండలంలో బంధవీధి, సింగర్బ, కోరాపల్లి, నుర్మతి, భీరం గ్రామాలకు, చింతపల్లి సబ్ స్టేషన్ పరిధి దారకొండ, గొర్లిగొంది, ఏనుగుబయలు, చెక్కలుదిమ్మ, పెదగంగవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామన్నారు. డుంబ్రిగుడ సబ్ స్టేషన్ పరిధిలోని కురిడి, కించుమండ, కొర్రాయి, కితలంగి, పెదపాడు గ్రామాలకు, కొయ్యూరు 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నందున బూధరాళ్ల పంచాయతీలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరపరాను నిలిపివేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

‘రేషన్ సరకులు పక్కదారిపై చర్యలు తీసుకోవాలి’



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

డుంబ్రిగుడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పక్కదారి పట్టినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు విమర్శించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పేద గిరిజనులకు నెల వారీ ఉచిత రేషన్ కల్పిస్తోందన్నారు. వీటిని పౌర సరఫరా అధికారులు జీసీసీ ద్వారా గోదాములకు చేరవేస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో డీఆర్‌డిపోల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేయాల్సి ఉందన్నారు. డీలర్లు, పొదుపు సంఘాలు ఈ బియ్యాని పక్కదారి పట్టిస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతికి ముందుగానే సరఫరా చేసిన బియ్యం, పంచదార, పప్పు, నూనె తదితర సరుకులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సంబధిత డిపో నిర్వాహకులు జేబులు నింపుకున్నారని ఆరోపించారు. పౌరసరఫరా అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ దన్నెరావు, మండల కార్యదర్శి చినగెన్ను నాయకుడు బోంజుబాబు పాల్గొన్నారు.

బూరిగ ఎంపీపీ పాఠశాలకు రేకులషెడ్డు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలెక్టర్ ఆదేశాలతో శాశ్వత భవనానికి రూ. 15 లక్షలతో ప్రతిపాదనలు



తాత్కాలికంగా నిర్మించిన రేకులషెడ్డు వద్ద చిన్నారులు

అనంతగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లి పంచాయతీ బూరిగ గ్రామ ఎంపీపీ పాఠశాలలో రేకుల షెడ్డును గిరిజన సంక్షేమశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలకు భవన సదుపాయం లేక విద్యార్థులు చెట్టుకింద టార్పాలిన్ వేసుకుని చదువులు సాగిస్తున్నారు. దీంతో ఈ పాఠశాలలో చదువుతున్న బూరిగతోపాటు చినకొనెల గ్రామాలకు చెందిన 36 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గత డిసెంబర్ 1వ తేదీన ‘చెట్టుకింద చదువులు.. చిన్నారులకు అవస్థలు’ శీర్షికన ‘ఆంధ్రజ్యోతి’లో వచ్చిన కథనానికి కలెక్టర్ దినేశ్‌కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాలపై పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణానికి రూ.15 లక్షలతో ఇంజనీరింగ్‌శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడంతో పాటుగా ప్రస్తుతానికి తాత్కాలిక రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని పాఠశాలకు రేకుల షెడ్డు ఏర్పాటుచేయడంపై గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా మంత్రి లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు



వాలీబాల్ కిట్లు అందిస్తున్న టీడీపీ నాయకులు

గూడెంకొత్తవీధి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగళ్లగొందిలో టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి ముక్కలి మహేశ్ ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ కార్యదర్శి, విద్యాశాఖ మం త్రి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నారాలోకేశ్ యువత ఆదర్శనీయమన్నారు. విద్యావంతుడిగా ఆయన ఎన్నో సేవలందిస్తున్నారన్నారు. అలాగే, భవిష్యత్తులో యువత రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. గిరిజన యువత క్రీడల్లోనూ రాణించాలని కిట్లు అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శి శ్యామల వరలక్ష్మి పాల్గొన్నారు.

గిరిజనులు సమస్యల్లో ఉంటే అరకు ఉత్సవాలా?: కాంగ్రెస్



కించుమండ సంతలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

డుంబ్రిగుడ,జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అరకులో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2 వతేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాలను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కించుమండ వారపు సంతలో ఆందోళన చేశారు. గ్రామాల్లో తాగునీరు, సీసీ రోడ్డు తదితర సమస్యలతో గిరిజనులు ఇబ్బంది పడుతుంటే, వాటిని పరిష్కరించకుండా ఉత్సవాల పేరిట ప్రజధనాన్ని వృథా చేయడం తగదని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు చినస్వామి ఈ సందర్భంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలు



సిరగాంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న పశుసంవర్థక శాఖ సిబ్బంది

అరకులోయ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎంపిక చేసిన గ్రామాల్లో వైద్య శిబిరాల ద్వారా మూగజీవాలకు వైద్యం అందిస్తున్నట్టు మండల పశువైద్యాధికారి శీనయ్య తెలిపారు. ఈ 20 వతేదీ నుంచి ఇప్పటి వరకు 135 పశుయజమానులకు చెం'దిన 1858 పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. జీవాలకు వ్యాధులు సోకితే పశువైద్యశాలను సంప్రదించాలన్నారు. అందుబాటులో ఉన్న గ్రామ సచివాలయాల పరిధిలోని వెటర్నరీ అసిస్టెంట్‌లకు సమాచారమందించాలన్నారు.

ఘనంగా రింతాడలో జాతర ప్రారంభం

గూడెంకొత్తవీధి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రింతాడ గ్రామంలో పాండవ మహేశ్వర జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు ఏటా మాదిరిగా ఈ సారీ ఏర్పాట్లు చేశారు. ఈ జాతర శనివారంతో ముగుస్తుందని, ప్రతి రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

చలి తీవ్రతకు వణుకుతున్న జనం

ముంచంగిపుట్టు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతుండడంతో చలి ప్రభావం అధికమవుతున్నది. దీంతో జనం వణుకుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే ఉత్తరాది నుంచి చలి గాలుల ప్రభావంతో రాత్రిపగలు తేడా లేకుండా చలి తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. దీంతో జనం ఉన్ని దుస్తులు ధరిస్తూ, మంటలుకాగుతూ చలి నుంచి రక్షణ పొందుతున్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చక్కని పరిష్కారం

▸▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

కశింకోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలను సమగ్రవంతంగా పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని తీడ గ్రామంలో భూముల రీ సర్వేకు సంబంధించి బుధవారం నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. పేదల భూములను కాపాడేందుకే ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేశామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే చక్కని వేదికగా పేర్కొన్నారు. రైతులంతా సద్వినియోగం చేసుకుని తద్వారా భూ రికార్డులను సరిచేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కాయల మురళీ, కర్రి సత్యనారాయణ, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీను, దొడ్డి రమణ, నైనంశెట్టి రమణారావు, ఉగ్గిన రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, కన్నూరుపాలెంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారిణి డాక్టర్ డయానా పలు పశువులకు చికిత్సలు అందించారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల, చిత్రంలో పీలా గోవింద

వెంకుపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొత్తూరు : అనకాపల్లి మండలం వెంకుపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండుగలా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం డబ్బులు అడిగితే రైతులను ఇబ్బందులకు గురిచేసేదని ఆరోపించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్ది తద్వారా రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. అనంతరం శ్మశానవాటికకు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.


గుండాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల

గ్రామాల్లో ఘనంగా తీర్థాలు

పరవాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో రెడ్డివారి కుటుంబీకుల ఆరాధ్య దేవత గుండాలమ్మ తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. తొలుత అమ్మవారికి రెడ్డి వారి కుటుంబీకులు పసుపుకుంకుమలు, వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులతో పాటు మాజీ జడ్పీటీసీ పైలా జగన్నాథరావు, సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, స్థానిక నాయకులు రెడ్డి శ్రీను, పైలా రామచంద్రరావు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటైంది. సాయంత్రం జరిగిన తీర్థంలో సాముగరిడీలు, కోలాటాలు, చిడతలు, తప్పెటగుళ్లు ఆకట్టుకున్నాయి.

సబ్బవరం : మొగలిపురం, గాలిభీమవరం, పైడివాడ గ్రామాల్లో సీతారామల తీర్థాన్ని బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు జరిపారు. మొగలిపురంలో ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, సర్పంచ్ గండి అరుణ, వంశీదీప్, గండి రవికుమార్ దర్శించుకున్నారు.

కూటమి పాలనలో పేదలకు ఉన్నత ప్రమాణాలతో విద్య

▸▸ గవర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర



అనకాపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవాడికి ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పనిచేస్తున్నారని రాష్ట్ర గవర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తెలిపారు. మంత్రి లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఇక్కడ ఆయన మాట్లాడారు. ఉన్నత విద్యావంతుడైన లోకేశ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యారంగంలో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ, అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు చేస్తున్న కృషి సత్ఫలితాలిస్తున్నట్టు చెప్పారు.

26న రైతు వ్యతిరేక విధానాలపై నిరసన

అనకాపల్లి టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26వ తేదీన ఇక్కడి నెహ్రూచౌక్‌లో జరిగే నిరసన కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్‌మోర్చ భాగస్వామ్య సంఘాలు పిలుపునిచ్చాయి. బుధవారం ఇక్కడ ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు మాట్లాడుతూ రిపబ్లిక్ డే సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన, ర్యాలీలు చేపట్టాలని సంయుక్త కిసాన్‌మోర్చ పిలుపునిచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఈ కార్యక్రమానికి రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, పేద ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల ప్రతినిధులు గాడి బాలు, కోన మోహనరావు, కె. తేలయ్యబాబు, గండి నాయనబాబు, ప్రజా రాజకీయ వేదిక ప్రతినిధి కనిశెట్టి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గుల్లాట ఆడుతున్న నలుగురిపై కేసు

కశింకోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉగ్గినపాలెం శివారులో గుల్లాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది వెళ్లి దాడి చేశారన్నారు. ఈ సందర్భంగా నలుగుర్ని అదుపులోకి తీసుకుని ఆరు గుళ్ల, రూ.3,550నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అనంతరం పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.

కోడి పందేలు ఆడుతున్న ఇద్దరి అరెస్టు

కొత్తూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం తగరంపూడిలో కోడి పందేలు ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు బుధవారం సిబ్బంది వెళ్లి దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా రెండు కోడిపుంజులతో ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్టు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

చెరువు అభివృద్ధి పనులు పరిశీలన


చెరువు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

లంకెలపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెపాలెం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న చెరువు అభివృద్ధి పనులను కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత పథకంలో భాగంగా గ్రీన్ ఏపీ కార్పొరేషన్ సంస్థ ఈ చెరువు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'హెల్మెట్ ధరించని వాహనదారులపై చర్యలు'

అనకాపల్లి టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జాతీయ రహదారిలోని నూకాంబిక అమ్మవారి ఆలయ ముఖద్వారం వద్ద ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో బుధవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా రెండోసారి పట్టుబడిన పది మంది ద్విచక్ర వాహనదారులకు మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్సు సస్పెన్షన్ చేసేందుకు సిఫార్సు చేసినట్టు సీఐ తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.కె. రషీద్, హెడ్‌కానిస్టేబుల్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్ట్



అనకాపల్లి టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు పాఠశాలల్లో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఎటువంటి ఆందోళన, గందరగోళం చెందకుండా ఉండేందుకే ఈ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ మండల కార్యదర్శి ఎం.నూకరాజు, ఎం.వినయ్, రాజు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.











ఇయర్ ఫోన్ల అతి వినియోగంతో చెవికి చేటు



రేడియేషన్ వల్ల మెదడు, నాడీ వ్యవస్థపై ప్రభావం

- పిల్లల్లో దుష్ప్రభావం ఎక్కువ
- వినికిడి శక్తి కోల్పోయే అవకాశం
- ఎక్కువ సమయం వాడితే ముప్పు తప్పదని వైద్య నిపుణుల హెచ్చరిక

పరవాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):

ఇయర్ ఫోన్లు పెట్టుకుని ఎక్కువ సమయం గడుపుతున్నారా?.. అయితే అది మీ చెవికి చేటేనని అంటున్నారు వైద్య నిపుణులు. రేడియేషన్ కారణంగా మెదడు, నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని, దీని ప్రభావం పెద్దల్లో కంటే పిల్లల్లో ఎక్కువ ఉంటుందని చెబుతున్నారు. ఎక్కువ సమయం పాటలు ఇయర్ ఫోన్ల ద్వారా వింటే శ్రవణానికి ముప్పుతప్పదని హెచ్చరిస్తున్నారు.

ఇయర్ ఫోన్ల అతి వినియోగం వల్ల చెవి లోపల కర్ణభేరి దెబ్బతింటుంది. అది సున్నితంగా ఉంటుంది. శబ్దాలకు దీని పనితీరు దెబ్బతిని వినికిడి సమస్యలు తలెత్తుతాయి. హెచ్చు స్థాయిలో నిత్యం పాటలు వినే 40 శాతం మందిని భవిష్యత్తులో వినికిడి సమస్య వేధించే అవకాశం ఉంది. పట్టణంలోనే కాక చుట్టూ ఉండే గ్రామీణ ప్రాంతాలలో కుర్రకారు ద్విచక్ర వాహనాలపై ఇయర్ ఫోన్లు పెట్టుకొని ఊగిపోతూ వెళుతుండడం చూస్తుంటాం. వెనుక నుంచి, పక్క నుంచి వచ్చే వాహనాల హారన్లు వినిపించక వీరు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీరి వల్ల మిగతా వాహనచోదకులూ ప్రమాదాల పాలయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇంతకు ముందుతో పోలిస్తే స్మార్ట్‌ఫోన్ల సంఖ్య పెరిగాక వినికిడి లోపంతో ఇబ్బంది పడే వారి సంఖ్య రెండు నుంచి మూడింతలు పెరిగింది. ప్రయాణ సమయాల్లో రైళ్లు, బస్సుల్లో మరింతగా వీటిని వినియోగిస్తున్నారు.

ఈ సమస్యలుంటే వైద్యుడిని సంప్రతించాలి

ఎవరైనా గట్టిగా పిలిచినా పలకకపోవడం, విద్యాలయంలో గంట మోగినా వినిపించకపోవడం, వేరే లోకంలో ఉన్నట్టు ఉండడం, వ్యసనంలా నిద్రలోనూ చెవిలో ఇయర్ ఫోన్లను పెట్టుకొని ఉండడం వంటివి వినికిడి శక్తి కోల్పోవడానికి సంకేతాలు. ఈ సమస్యలుంటే వెంటనే వైద్యుడిని సంప్రతించాలి. తద్వారా దీర్ఘకాలిక సమస్యల నుంచి బయట పడవచ్చు.

వినికిడి శక్తిని కోల్పోయే ప్రమాదం



ఇయర్ ఫోన్లను నిరంతరం వినియోగించడం వల్ల చెవులు వినికిడి కోల్పోయే ప్రమాదం ఉంది. చెవులు చాలా సున్నితమైనవి. రోడ్డు పక్కన దొరికే ఇయర్ ఫోన్లను తక్కువ ధరకు వస్తాయని చాలా మంది కొని వాడుతారు. నాసిరకం ఇయర్ ఫోన్ల వినియోగం తర్వాత కంటి, చెవి, మెదడు సంబంధిత సమస్యలతో బాధపడి ఆస్పత్రులను ఆశ్రయించే వారి సంఖ్య పెరిగింది. జ్ఞానేంద్రియాలను చేతులారా పాడుచేసుకోవద్దు.

- హారిక, పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి

బాలికల సదన్ వద్ద ఉద్రిక్తత

- గోడ దూకి రోడ్డుపైకి వచ్చిన ఐదుగురు బాలికలు
- మేట్రిన్ కుమారి చిత్ర హింసలకు గురిచేస్తున్నారని ఆరోపణ
- 18 ఏళ్లు నిండినా ఇళ్లకు పంపడం లేదని ఆవేదన
- సర్దిచెప్పిన ఏసీపీ నరసింహమూర్తి, అధికారులు

ఆరిలోవ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): 'మేట్రిన్ చిత్రహింసలను తట్టుకోలేకపోతున్నాం. మైనారిటీ తీరినా విడుదల చేయడం లేదు'...అంటూ ప్రత్యేక బాలికల పరిశీలన గృహానికి చెందిన ఐదుగురు బాలికలు గోడ దూకి రోడ్డుపైకి చేరి హడావిడి సృష్టించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హోమ్ సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ద్వారకా ఏసీపీ నరసింహమూర్తి, ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు చేరుకుని బాలికలను సముదాయించారు. వివరాలిలా ఉన్నాయి.

నగరంలోని విశాఖ వేలీ స్కూల్ సమీపంలోని ప్రభుత్వ బాలికల పరిశీలన గృహం, బాలికల సదనంలో ఉంటున్న హైదరాబాద్, పశ్చిమ గోదావరి, కృష్ణా, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఐదుగురు బాలికలు బుధవారం మధ్యాహ్నం ఆందోళనకు దిగారు. గోడలు ఎక్కి, పెద్దపెద్ద రాళ్లను హోమ్‌లోకి విసిరారు, పైన రేకులు, పెంకులు తొలగించారు. పోలీసులు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ జేడీ జయదేవి, చినగదిలి తహసీల్దార్ పాల్‌కిరణ్‌లు అక్కడకు చేరుకుని బాలికల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలికలు మాట్లాడుతూ తమను మేట్రిన్ కుమారి చిత్ర హింసలకు గురిచేస్తోందని ఆరోపించారు. 18 సంవత్సరాల వయసు దాటినా ఇప్పటికీ ఇళ్లకు పంపకుండా హోమ్‌లోనే ఉంచడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇక్కడ నరకయాతన అనుభవిస్తున్నామని వాపోయారు. నిద్రమాత్రలు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చేయరాని పనులు చేయిస్తున్నారన్నారు. తల్లిదండ్రుల చెంతకు చేరితేనే తమకు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మేట్రిన్ పెడుతున్న హింసలను భరించలేక ఆందోళనకు దిగాల్సి వచ్చిందని వివరించారు.

కాగా బాలికల హోమ్ సూపరింటెండెంట్ సునీత మాట్లాడుతూ సుమారు 60 మంది బాలికలను కోర్టు ఉత్తర్వుల మేరకు సీడబ్ల్యూసీ (చిల్డ్రన్ వెల్ఫేర్ కమిటీ) అధికారులు ఇక్కడ ఉంచారన్నారు. రోడ్డుపై అల్లరి చిల్లరగా తిరుగుతున్నవారు, తల్లిదండ్రులకు దూరమైనవారు, అల్లరి పనులు చేసిన బాలికలకు షెల్టర్ ఇచ్చామన్నారు. వారందరినీ మంచి విద్యార్థినులుగా తీర్చిదిద్ది, స్వయం ఉపాధి పొందేందుకు శిక్షణ అందిస్తున్నామన్నారు. వీరిలో నలుగురు విద్యార్థినుల మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో చికిత్స అందిస్తున్నామని వివరించారు. ఆ నలుగురు చేతులు కోసుకోవడం లాంటి పనులకు తెగించారన్నారు. ఇదిలావుండగా బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ వీరయ్య బాలికలతో మాట్లాడి కోర్టు ఉత్తర్వుల మేరకు 18 సంవత్సరాలు నిండి వారందరినీ ఇళ్లకు పంపుతామన్నారు. దీంతో తాత్కాలికంగా సమస్య సద్దుమణిగింది.

షార్జా నుంచి క్షేమంగా..

- నగరానికి చేరిన ఐదుగురు యువకులు
- చొరవ చూపిన సీపీ శంఖబ్రత బాగ్చి



షార్జా నుంచి నగరానికి చేరుకున్న యువకులతో సీపీ శంఖబ్రత బాగ్చి, ఇతర పోలీసు అధికారులు

గోపాలపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వెల్డర్ ఉద్యోగం కోసం షార్జా వెళ్లి మోసపోయి, నెలరోజులుగా ఇబ్బంది పడుతున్న ఐదుగురు యువకులు బుధవారం నగరానికి క్షేమంగా చేరుకున్నారు. వీరిని ఇక్కడికి రప్పించడానికి పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చొరవ చూపించారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. అనకాపల్లి జిల్లాకు చెందిన పొలుపర్తి లక్ష్మణరావు (21), గార రాజేశ్ (21), పైలా రామస్వామి (21), శ్రీకాకుళం జిల్లాకు చెందిన కాళ్ల వెంకటరావు (25), పెదగంట్యాడకి చెందిన గెద్దాడ లోకేశ్ (24) పారిశ్రామిక ప్రాంతంలో వెల్డింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. గాజువాకకి చెందిన ఓ ఏజెన్సీ ద్వారా ఉద్యోగం కోసం గత నెలలో విజిట్ వీసాపై షార్జా వెళ్లారు. అక్కడ ఏజెన్సీలో వెల్డింగ్ టెస్ట్ నిర్వహించి, హెల్పర్లుగా చేరమని చెప్పారు. వెల్డర్ ఉద్యోగం కోసం వస్తే తక్కువ జీతానికి హెల్పర్ ఎలా చేస్తామని నిరాకరించారు. ఈ మేరకు ఇక్కడి ఏజెన్సీకి సమాచారం ఇవ్వడంతో నగరానికి సొంత ఖర్చులతో రావాలని రెండు రోజుల్లో పాస్‌పోర్ట్ ఇప్పిస్తానని ఏజెంట్ చెప్పాడు. ఇరవై రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో లోకేశ్ సీపీకి ఫోన్ చేసి విషయం చెప్పాడు. స్పందించిన సీపీ ఏజెంట్‌తో మాట్లాడి తక్షణమే యువకుల్ని నగరానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీపీకి వారు ధన్యవాదాలు తెలిపారు. కాగా, ఏజెన్సీల ద్వారా విదేశీ ఉద్యోగాలకు వెళ్లే నిరుద్యోగుల్లో కొందరు ఇబ్బంది పడుతున్నారని, వారు నేరుగా ఫోన్ చేసి సంప్రదిస్తున్నారని, అలాంటి వారిని తిరిగి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని సీపీ స్పష్టం చేశారు. ఇలాంటి ఏజెన్సీలపై ప్రత్యేక బృందంతో నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ గుర్తింపు లేకుండా ఏజెన్సీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లాను మొదటి స్థానంలో నిలుపుతాం

- అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధికి చర్యలు
- చోడవరం, మాడుగుల్లో పరిశ్రమల ఏర్పాటుపై అధ్యయనం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర
- చోడవరం నియోజకవర్గంలో పర్యటన
- గోవాడ షుగర్స్‌లో అధికారులు, కార్మికులతో సమావేశం
- గంధవరంలో విత్తన గిడ్డంగి నిర్మాణ పనులు పరిశీలన



గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

చోడవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పమని, ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాను అన్ని రంగాల్లో మొదటి స్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయన చోడవరం మండలంలో పర్యటించారు. గంధవరంలో విత్తన గిడ్డంగి నిర్మాణ పనులను పరిశీలించారు. తరువాత గోవాడ షుగర్ ఫ్యాక్టరీని సందర్శించారు. చోడవరంలో రైతుబజార్, అసంపూర్తిగా వున్న తహసీల్దార్ కార్యాలయం భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో అధికారులు, కార్మికులు, కూటమి పార్టీల నాయకులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ, జిల్లాను యూనిట్‌గా తీసుకుని స్థానిక వనరులను ఉపయోగించుకుని దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రణాళికలు రూపొందించి ప్రగతి పథంలో నడిపించడానికి సీఎం చర్యలు చేపట్టారన్నారు. జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలతో ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. పారిశ్రామికంగా వెనుకబడిన చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏ తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చో పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో విధ్వంసం అయిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడమే సీఎం లక్ష్యమన్నారు. ఇందుకు కేంద్రం కూడా సహకారం అందిస్తున్నదని తెలిపారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటికే నిధులు కేటాయించిన కేంద్రం, తాజాగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కూడా నిధులు మంజూరు చేసిందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును వేగంగా పూర్తిచేసి శ్రీకాకుళం జిల్లా చివరి వరకు గోదావరి జలాలు అందించాలన్నది సీఎం సంకల్పమని వెల్లడించారు. అనంతరం పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రైతు బజారు, రెవెన్యూ కార్యాలయం భవనాలను పరిశీలించిన మంత్రి, వీటి నిర్మాణం పూర్తికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి పర్యటనలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్‌రాజు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఆర్డీవో ఆయిషా, టీడీపీ నాయకులు గేదెల సత్యనారాయణ, గూనూరు మల్లునాయుడు, జనసేన నాయకులు సిరిపురపు రమేశ్, జి.మూలినాయుడు, తహసీల్దార్ అంబటి రామారావు, ఎండీవో ఆంజనేయులు పాల్గొన్నారు.

గవరపాలెం గౌరమ్మకు సారె సమర్పణ

- మహిళలు ఇళ్లలో తయారు చేసిన పిండివంటలతో భారీగా ఊరేగింపు
- ఆలయానికి చేరుకుని నైవేద్యంగా సమర్పణ
- పెద్ద సంఖ్యలో ఆది దంపతులను దర్శించుకున్న భక్తులు



గౌరీ పరమేశ్వరుల కల్యాణం జరుపుతున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):

ఇక్కడి సతకంపట్టులోని గవరపాలెం గౌరీ పరమేశ్వరుల సారె మహోత్సవం బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయం ఎదుట ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు ఆధ్వర్యంలో కొణతాల నూక మహాలక్ష్మినాయుడు దంపతులు, పొలిమేర రవి దంపతులు గౌరీ పరమేశ్వరుల వార్షిక కల్యాణాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. మధ్యాహ్నం గౌరమ్మకు సారేతో భక్తులు బయల్దేరగా, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ఊరేగింపును ప్రారంభించారు. ముందుగా ఆయన గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. మహిళలు తమ ఇళ్లలో తయారుచేసిన వివిధ రకాల పిండివంటలు, మిఠాయిలను పళ్లేల్లో పేర్చి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. సతకంపట్టు అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన సారె ఊరేగింపు చినరామస్వామి కోవెల, పెదరామస్వామి కోవెల, గంగిరేవిచెట్టు, దిబ్బవీధి, అగ్గిమర్రిచెట్టు, వేగివీధి, చింతావారివీధి, మెయిన్‌రోడ్డు, బాలకృష్ణ బస్టాప్, పరమేశ్వరీ పార్కు జంక్షన్ మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. ఆలయం వద్ద అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన అనంతరం ఇళ్లకు తీసుకు వెళ్లి ప్రసాదంగా అందరికీ పంచిపెట్టారు. అమ్మవారికి ప్రత్యేకంగా పసుపు, కుంకుమ ఊరేగింపులో భాగంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొణతాల శ్రీనివాసరావు, కొణతాల మహాలక్ష్మినాయుడు, కొణతాల మురళీకృష్ణ, పీవీ రమణ, కొణతాల ప్రసాద్, దాడి కృష్ణ, పెంటకోట జగది, సూరిశెట్టి నరసింగరావు, కొణతాల కృష్ణంరాజు, బుద్ద భూలోకనాయుడుతో పాటు సతకంపట్టు పెద్దలు పాల్గొన్నారు. ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారి ఆలయం ముందు ఏర్పాటు చేసిన పసుపు, కుంకుమ, పిండివంటలు

29న సింహాచలేశుడి తెప్పోత్సవం

సింహాచలం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి నౌకా విహారోత్సవం (తెప్పోత్సవం) ఈ నెల 29న నిర్వహించనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు ప్రకటించారు. ఇందులో భాగంగా స్వామిని మధ్యాహ్నం 3.30 గంటలకు మెట్లమార్గంలో దిగువకు తీసుకువచ్చి హంసాకృతి నౌకలో ఉత్సవాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

ఏయూ వీసీ ఎంపిక ప్రక్రియ కొలిక్కి?

... 3వ పేజీ తరువాయి

ఉన్నట్టు తాజాగా నెలకొన్న పరిణామాలను బట్టి అర్థమవుతోంది. ఉన్నత విద్యను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని భావిస్తున్న ప్రభుత్వం...అందుకు అనుగుణంగా జాతీయ స్థాయి వర్సిటీల్లో పనిచేసిన వారిని వీసీలుగా ఎంపిక చేయాలని నిర్ణయించు కున్నట్టు తెలుస్తోంది.

సీనియర్ ప్రొఫెసర్లలో చర్చ..

ప్రస్తుతం వర్సిటీలో ఏ ఇద్దరు ప్రొఫెసర్లు కలుసుకున్నా దీనిపైనే మాట్లాడుకుంటున్నారు. ఐఐటీ ప్రొఫెసర్ల పేర్లను సెర్చ్ కమిటీ పరిగణనలోకి తీసుకుందన్న విషయం బయటకు రావడంతో కొందరు సీనియర్ ప్రొఫెసర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వందేళ్ల వేడుకలకు వర్సిటీ సిద్ధమవుతున్న తరుణంలో బయటనుంచి వచ్చిన వారిని వీసీగా నియమించడం వల్ల కొన్నిరకాల ఇబ్బందులు ఉంటాయని పేర్కొంటున్నారు. ఐఐటీలు, స్టేట్ వర్సిటీల్లో పాలన భిన్నంగా ఉంటుందని, ఈ విషయాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు.

ఆర్ఈసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా కలెక్టర్ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

కశింకోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్ఈసీఎస్) పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ బాధ్యతలు స్వీకరించారు. 'ఖాళీగా ఆర్ఈసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పోస్టు' అనే శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో ఉన్న తన చాంబర్‌లో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిషనర్ ఫర్ కో ఆపరేషన్ అండ్ రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీ శాఖ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం తమను నియమిస్తూ వ్యవసాయం సహకార శాఖ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి ఎం. శ్యామల, ఆర్ఈసీఎస్ ప్రాజెక్టు ఇంజనీర్ జె.ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రోకళ్ల శివాజీ (ఫైల్)

రోలుగుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని శరభవరం గ్రామానికి చెందిన రోకళ్ల శివాజీ (20) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గ్రామానికి చెందిన రైతు పెద్దింటి రమణ తన వ్యవసాయ పొలం వద్ద మోటారుకు విద్యుత్ రాలేదని శివాజీకి చెప్పాడు. దీంతో బుధవారం సాయంత్రం పొలానికి వెళ్లి మోటారును పరిశీలించాడు. విద్యుత్ రాకపోవడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేశాడు. ఈ సమయంలో విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ రామకృష్ణారావు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



జామి శిరీష (ఫైల్)

నర్సీపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దనిమిరెడ్డివీధిలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణ సీఐ గోవిందరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా శంకవరం గ్రామానికి చెందిన శిరీషాకి, నర్సీపట్నం దనిమిరెడ్డివీధికి చెందిన జామి ప్రసాద్‌తో 2018లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రసాద్‌కు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో దంపతులు గొడవలుపడేవారు. ఈ క్రమంలో శిరీషా మంగళవారం సాయంత్రం పడక గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. మృతిరాలి తల్లి మైదాను సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యాన్ డ్రైవర్ మృతి

అనకాపల్లి టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జాతీయ రహదారిలోని డైట్ కళాశాల సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ డ్రైవరు మృతి చెందినట్టు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. విజయవాడకు చెందిన షేక్ బాషా (42) వ్యాన్ నడుపుతూ ఈ నెల 14న ముందు వెళ్తున్న లారీని కొన్నట్టు చెప్పారు. తీవ్ర గాయపడిన అతనిని ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్సల అనంతరం తోటి సిబ్బంది గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చేర్పించారన్నారు. బలమైన గాయాలు కావడంతో బాషా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు అతని కుమారుడు షేక్ వాసిన్ బుధవారం ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఏఎస్ఐ నాగేశ్వరరావు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారన్నారు.

గంజాయి కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు

కశింకోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఓ వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షలు జరిమానా విధించినట్టు అనకాపల్లి 10వ అదనపు జిల్లా కోర్టు జడ్జి నందనవనం శ్రీవిద్య తీర్పు ఇచ్చారని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం తెలిపారు. 2013 నవంబరు 12న ఉదయం 10 గంటల సమయంలో కశింకోట మండలం తీడ గ్రామం సమీపంలో కచ్చర్లపాలెం జంక్షన్ మీదుగా కారులో తరలిస్తున్న 60 కిలోల గంజాయిని అప్పటి ఎస్ఐ వి.శ్రీనివాసరావు పట్టుకున్నారని చెప్పారు. ఈ కేసులో రోలుగుంటకు చెందిన గొలుసు దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారన్నారు. అప్పటి కేసుకు సంబంధించి కోర్టులో వాదోపవాదాలు తరువాత జడ్జి శ్రీవిద్య తుది తీర్పు ఇచ్చారని ఎస్పీ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచిన అప్పటి ఎస్ఐ వి.శ్రీనివాసరావు, ప్రస్తుత సీఐ అల్లు స్వామినాయుడు, సిబ్బందిని ఆయన అభినందించారు. కాగా ఈ కేసుకు సంబంధించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిహెచ్.వీరకృష్ణ వాదనలు సమర్థిస్తూ జడ్జి తీర్పును వెల్లడించారు.

రూ.2 లక్షల కోట్లతో పారిశ్రామిక ప్రగతి

... 3వ పేజీ తరువాయి

ప్రభుత్వం పోలవరం ప్రధాన ఎడమ కాలువ పనులు పూర్తి చేయకుండా గాలికొదిలేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పోలవరం పనులపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ ఏడాది జూన్‌నాటికి ఎడమ కాలువ పనులు పూర్తిచేసి జిల్లాకు గోదావరి జలాలను తీసుకువస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద రాష్ట్రంలో ప్రతి నెల రూ.2,700 కోట్లు పేదలకు వివిధ రకాల పింఛన్లు అందిస్తున్నామన్నారు. మహిళలకు ఏటా ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, సాంకేతిక కారణాల వల్ల తల్లికి వందనం పథకం అమలు ఆలస్యమైందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి కచ్చితంగా అమలు చేస్తామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు 75 ఏళ్ల వయస్సులో మైనస్ 7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతున్న దావోస్ వెళ్లి ప్రపంచ ఆర్థిక సదస్సులో రాష్ట్రానికి పెట్టుబడులను రప్పించడానికి కృషి చేయడం గొప్ప విషయమన్నారు. జిల్లాలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ఎంఓయూ పూర్తయ్యిందని ఆయన తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్ కుమార్, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు బత్తుల తాతయ్యబాబు, మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, ప్రగడ నాగేశ్వరరావు, జనసేన చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యం

... 3వ పేజీ తరువాయి


చేస్తారు. ప్లాస్టిక్ విక్రయిస్తూ పట్టుబడితే మొదటిసారి రూ.2,500లు, రెండోసారి అయితే రూ.5 వేలు, మూడోసారి రూ.10 వేలు, నాలుగోసారి రూ.20 వేలు, ఐదోసారి రూ.40 వేలు జరిమానా విధిస్తారు. అప్పటికీ ప్లాస్టిక్ అమ్మకాలు సాగిస్తే దుకాణాన్ని సీజ్ చేసి, ట్రేడ్ లైసెన్సును రద్దు చేస్తారు.

ఇవీ నిషేధ వస్తువులు..

120 మైక్రాన్ల కంటే తక్కువ మందం వున్న పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ టీ కప్పులు, ప్లాస్టిక్ గ్లాసులు, వివిధ రంగుల పేపర్ టిఫిన్/, భోజనం ప్లేట్లు, తెలుపు కాకుండా ఇతర రంగుల గుడ్డ సంచులు, టీ పార్శిల్ చేసే సిల్వర్ కలర్ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ స్పూన్లు

బయోడిగ్రేడబుల్ కవర్లు వాడాలి

-ఆర్.రవికుమార్, శానిటేషన్ సూపర్‌వైజర్



తక్కువ మందం (120 మైక్రాన్లకు లోపు) ఉండే ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల అమ్మకాలు, వినియోగాన్ని నిషేధించాం. త్వరగా మట్టిలో కలిసిపోయే బయోడిగ్రేడబుల్ కవర్లను మాత్రమే వాడాలి. ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా రెండు బృందాలుగా ఏర్పడి దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నాం. ప్రస్తుతం ప్లాస్టిక్ వాడకంపై అనర్థాల గురించి అవగాహన కల్పిస్తున్నాం. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పట్టుబడిన వారికి జరిమానా విధిస్తాం. ప్లాస్టిక్ రహిత అనకాపల్లిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509